ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కడప

జిల్లా వార్తలు

5

ఆదివారం 13 జులై 2025

లంకమల, పాలకొండల్లో కూంబింగ్


సిద్దవటం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): లంకమల, పాలకొండల్లో కూంబింగ్ నిర్వహించినట్లు సిద్దవటం రేంజర్ బి.కళావతి, కడప ఫారెస్ట్ రేంజ్ అధికారి ప్రసాద్ తెలిపారు. సిద్దవటం ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని రోళ్లబోడు, గొల్లపల్లె, సిద్దవటం ఫారెస్ట్ బీట్‌లలో సమస్యాత్మక అనుమానిత అటవీ ప్రదేశాల్లో ఎర్రచందనం తరలిపోకుండా శనివారం కూంబింగ్ నిర్వహించామన్నారు. కడప ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని భాకరాపేట ఫారెస్ట్ బీట్‌లో శనివారం కూంబింగ్ నిర్వహించామన్నారు.

వైసీపీ నే(మే)త..!

- 30ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణ
- ఎకరం రూ.25 లక్షలకు పైమాటే
- ప్రభుత్వ భూమికి విద్యుత్ కనెక్షన్
- దానిమ్మ, మామిడి, నిమ్మ, జామ తోటల సాగు



సీకే దిన్నె మండలంలో ప్రభుత్వ భూములను ఆక్రమించేసి ఉద్యానపంటలు సాగు చేస్తున్న దృశ్యం





(జూలై-ఆంధ్రజ్యోతి): భూ కబ్జా చేయాలంటే వైసీపీలోని కొందరు నేతలకు ఉన్నంత దమ్ము ఎవరికి ఉండదేమో. అది ప్రభుత్వ భూమి అయినా, ప్రైవేటు భూమి అయినా సొంత ఆస్తిలా ఆక్రమించేసి అనుభవించుకోవడం ఆ పార్టీ నేతలకు చెల్లు. కడప నగరానికి ఆనుకుని సీకేదిన్నె మండల పరిధిలో ప్రభుత్వ భూములు ఎక్కువగా ఉన్నాయి. ఇక్కడ చిత్తూరు కర్నూలు జాతీయ రహదారి, రింగ్‌రోడ్డు ఉండటంతో భూములకు విలువ ఎక్కువ. సీకేదిన్నె మండల పరిధిలో ఫామ్ హౌస్‌లు, రిసార్ట్‌లు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇక్కడ భూముల ఆక్రమణలూ ఎక్కువే. ఇక వైసీపీ హయాంలో అయితే ప్రభుత్వ భూముల ఆక్రమణ అడ్డుఅదుపు లేకుండా సాగింది. సీకేదిన్నె మండలంలోని మామిళ్లపల్లె రెవెన్యూ పొలం సర్వే నెంబర్ 738/1లో 1.55ఎకరాలు, 738/3లో 2.68ఎకరాలు, 739/1లో 3.16, 739/3లో 1.05, 740/1లో 4.65, 740/3లో 2సెంట్లు, 749లో 9.31ఎకరాలు, 748/2లో 2.28, 727లో 4.75 ఎకరాల చొప్పున 29.40ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిని వైసీపీ హయాంలో కడపకు చెందిన ఓ కార్పొరేటర్ కబ్జా చేశారు. రింగురోడ్డు, పోలీస్‌స్టేషన్, అంగడి వీధి, రైల్వేకు సంబంధించిన భూములు, తెలుగుగంగ ప్రాజెక్టు భూములను సైతం ఆక్రమించేసి లేఅవుట్లు వేశారని చెబుతారు. ఆయన ఆధ్వర్యంలోనే ఈ భూముల ఆక్రమణ జరిగిందని సమాచారం.

విద్యుత్ కనెక్షన్లు

నిబంధనల ప్రకారం అన్నీ ఉన్నా వ్యవసాయానికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలంటే ట్రాన్స్‌కో అధికారులు సామాన్య రైతులను ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు తాపుతారు. మరి ఇక్కడ ప్రభుత్వ భూములకు ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడం గమనార్హం. ఇక్కడ బోర్లు వేసి మోటార్లు బిగించి సొంత భూముల్లా ఉద్యానపంటలు సాగుచేసుకుంటున్నారు. దాదాపు 30 ఎకరాల ప్రభుత్వ భూముల్లో నిమ్మ, దానిమ్మ, మామిడి, జామ చెట్లు సాగులో ఉన్నాయి. జగన్ హయాంలో ఈ కబ్జా వ్యహారం సాగడం.. ఆక్రమించింది వైసీపీ నేత కావడంతో నాడు రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోలేదు. ఇప్పుడు సీఎం చంద్రబాబు ఆదేశాలతో జిల్లాలో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూముల వ్యవమారం ఒక్కోటి వెలుగులోకి వస్తున్నాయి. వైసీపీ నేత ఆక్రమించిన 30 ఎకరాల ప్రభుత్వ భూమిని అర్హులైన పేదలకు ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.

> **నోటీసులు జారీ చేశాం**
>
> ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైనట్లు ఫిర్యాదులు రావడంతో పరిశీలించాం. అది ప్రభుత్వ భూమే. ఆ భూములను సాగు చేసిన వారికి నోటీసులు జారీ చేశాం. ఆ భూములు తిరిగి స్వాధీనం చేసుకుంటాం.
>
> - నాగేశ్వరరావు, తహశీల్దార్, సీకే దిన్నె

వైసీపీ హయాంలో ప్రభుత్వ, ప్రైవేటు భూములను చెరబట్టి వందలాది ఎకరాలను ఆక్రమించేశారు. కడప శివారులోని సీకే దిన్నె మండలం బుగ్గవంక సమీపంలో సుమారు 30ఎకరాల ప్రభుత్వ భూమిని ఓ వైసీపీ నేత ఆక్రమించేసి పండ్ల తోటలు సాగుచేశారు. కూతవేటు దూరంలో కబ్జా సాగుతున్నా రెవెన్యూ శాఖ మిన్నకుండిపోవడం గమనార్హం. కడప కార్పొరేషన్‌లోని ఓ కార్పొరేటర్ బినామీ పేర్లతో ఈ భూములను కొట్టేసినట్లు చెబుతారు. ఆ భూమి ఎకరం రూ.25లక్షలకు పైమాటే. ఈ లెక్కన ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి దాదాపు రూ.7కోట్లకు పైగా చేస్తుంది. వైసీపీ నేతల భూ ఆక్రమణలపై సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి దృష్టిపెట్టారు. ఈ నేపథ్యంలో సీకేదిన్నెలో వైసీపీ నేత భూ కబ్జా బయటకు వచ్చింది.

గురుకులాల్లో మిగిలిన సీట్లకు 16న కౌన్సెలింగ్

కడప ఎన్జీఆర్ సర్కిల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కడప, అన్నమయ్య జిల్లాల్లోని 24 అంబేడ్కర్ రెసిడెన్షియల్ స్కూళ్లల్లో 6, 7, 8, 9 తరగతులకు సంబంధించిన మిగిలిపోయిన సీట్లకు ఈ నెల 16వ తేదీ బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు గురుకుల విద్యాలయాల ఇన్‌స్టిట్యూషన్ సొసైటీ సమన్వయకర్త ఉదయశ్రీ శవాఅరం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష రాసి సీట్లు లభించని విద్యార్థులు ఈ నెల 16న చిన్నచౌకు గురుకుల పాఠశాలలో కౌన్సెలింగ్‌కు హాజరుకావాల్సిందిగా సూచించారు. అదే విధంగా పదో తరగతి, ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో నేరుగా ప్రవేశాలు కోరేవారు ఈ కౌన్సెలింగ్‌కు హాజరుకావచ్చని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు అన్నమయ్య ప్రాజెక్టు పరిశీలన

కడప ఎన్జీఆర్ సర్కిల్, జూలై 12(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణం కోసం సాంకేతిక నిపుణుల కమిటీ ఆదివారం ప్రాజెక్టు పరిసర ప్రాంతాలను పరిశీలించనుంది. ప్రాజెక్టు డిజైన్ నిర్మాణం, కార్యాచరణ సవాళ్లను అధ్యయనం చేసేందుకు ఆరుగురితో కూడిన ఒక నిపుణుల కమిటీని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు కమిటీ శనివారం కడపలోని ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీరు కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ కమిటీలో డిజైనింగ్ ఎక్స్‌పర్ట్ రమేశ్ కుమార్, హైడ్రా మెకానికల్ ఎక్స్‌పర్ట్ రిటైర్డ్ సత్యనారాయణన్, జియాలజిస్ట్ విభాగానికి చెందిన రిటైర్డ్ డీజీ ఎం.రాజు, డిజైనింగ్ అప్రూవ్ అథారిటీ విజయవాడ సీడీవో, హైడ్రాలజీ నిపుణుడు విజయవాడకు చెందిన హైడ్రాలజీ చీఫ్ ఇంజనీరు, కమిటీ కన్వీనరుగా కడప ప్రాజెక్టుల విభాగానికి సంబంధించిన సి.రామచంద్రమూర్తిని నియమించారు. ఈ కమిటీ ప్రాజెక్టు పునర్నిర్మాణానికి సంబంధించి అడ్డంకులు అవరోధాలను దృష్టిలో ఉంచుకుని ఉత్తమ డిజైన్ ప్రత్యామ్నాయాన్ని అందించనుంది. ఈ క్రమంలో ప్రాజెక్టుకు సంబంధించిన అనేక విషయాలపై శనివారం చర్చించారు. అదే విధంగా క్షేత్రస్థాయిలో కూడా పరిశీలన చేసి నిర్ణీత సమయంలో ప్రాజెక్టును పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోనున్నారు. ఇందులో భాగంగా వీరు ఆదివారం రాజంపేట నియోజకవర్గంలో అన్నమయ్య ప్రాజెక్టు ఆనకట్ట తెగిపోయిన ప్రాంతాన్ని పరిశీలించనున్నారు.

ప్రైవేటు ఆసుపత్రిలో
ఆరోగ్యశ్రీ పేరుతో మోసం

బద్వేలుటౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): బద్వేలు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ పథకాన్ని అడ్డుపెట్టుకొని పేదలను పీడిస్తుండటంతో రోగి బంధువులు వైద్యులను నిలదీశారు. దీంతో వారు రోగి మనవడిపై దాడికి పాల్పడ్డారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బాధితుల కథనం మేరకు..

బి.మఠం మండలం చీకటివారిపల్లెకు చెందిన మాచుపల్లె చిన్నసుబ్బరాయుడు అనారోగ్యంతో బద్వేలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరాడు. అక్కడి వైద్యుడు రోగిని పరీక్షించి కడుపులో గడ్డ ఉందని, శస్త్రచికిత్స అవసరమని తెలిపారు. రోగి బంధువులు ఖర్చులు భరించలేమని చెప్పడంతో ఆరోగ్యశ్రీద్వారా ఉచితంగా వైద్యం అందిస్తామని వైద్యుడు హామీ ఇచ్చారు. దీనికి బంధువులు సరే అనడంతో రోగిని ఆసుపత్రిలో చేర్చుకుని వివిధ పరీక్షల కోసం డబ్బులు తీసుకున్నారు. శుక్రవారం శస్త్రచికిత్స జరగాల్సిన సమయంలో మరికొంత డబ్బు ఇవ్వాలంటూ ఆసుపత్రి సిబ్బంది డిమాండ్ చేశారు. ఆరోగ్యశ్రీ ఉన్నప్పుడు డబ్బులు ఎందుకు చెల్లించాలి అని ప్రశ్నించడంతో పాటు డబ్బులు చెల్లించినవాటికి బిల్లులు ఇవ్వాలని కోరారు. దీంతో ఆసుపత్రి సిబ్బంది ఆగ్రహంతో బిల్లులు ఇవ్వము, ఇష్టం లేకపోతే ఎక్కడికైనా వెళ్లిపొమ్మని గట్టిగా అరవడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో మైదుకూరు రోడ్డులోని ఓ టీ దుకాణం వద్ద రోగి మనవడు ఉండగా.. ఈ విషయాన్ని మీరు మీడియాకు చెబుతారా అంటూ వైద్యుడు, సిబ్బంది అతడిపై దాడికి యత్నించారు. స్థానికులు అడ్డుకోవడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. పేదల ఆరోగ్య హక్కుల విషయంలో మోసం చేసిన ప్రైవేటు వైద్యుడిపై సంబంధిత ఆరోగ్యశ్రీ అధికారులు విచారణ చేపట్టాలని వారు కోరుతున్నారు.

కష్టపడితే విజయం మీదే

- విద్యార్థులతో ఎస్పీ అశోక్‌కుమార్



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులతో ఎస్పీ అశోక్‌కుమార్

కడప క్రైం, జూలై 12 (ఆంధ్ర జ్యోతి): విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని సాధించేందుకు కార్యాచరణ రూపొందించుకుని కష్టపడితే విజయం సొంతమవుతుందని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ అన్నారు. టెన్త్, ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన 63 మంది పోలీసు, హోంగార్డులు, డీపీవో సిబ్బంది కుటుంబాల పిల్లలకు పోలీసు సంక్షేమంలో భాగంగా శనివారం స్థానిక పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో నగదు ప్రోత్సాహక మెరిట్ స్కాలర్‌షిప్‌లు, ప్రశంసాపత్రాలను ఎస్పీ అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాగా చదివి బంగారంలాంటి భవిష్యత్తుకు బాటలు వేసుకుని అత్యున్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పోలీసు పిల్లలు చక్కగా చదివి మంచి మార్కులు సాధించి మెరిట్ స్కాలర్‌షిప్ అందుకోవడం ప్రశంసనీయ మన్నారు. ఈ స్ఫూర్తితో మున్ముందు రెట్టింపు కృషితో చదువుల్లో ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవాలన్నారు. విద్యార్థులు వారు ఎంచుకున్న రంగంలో, వృత్తిలో రాణించేందుకు తల్లిదండ్రుల ప్రోత్సాహం తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ రమణయ్య, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్ఐ శ్రీశైలరెడ్డి, ఆర్ఎస్ఐ వెంకటేశ్వర్లు, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పుశంకర్ తదితరులు పాల్గొన్నారు.

చంపేస్తామని బెదిరిస్తున్నారు

- వివేకా హత్య కేసు నిందితుడు ఉమాశంకర్‌రెడ్డి



తనను బెదిరించారని సీఐకి తెలుపుతున్న ఉమాశంకర్‌రెడ్డి

పులివెందుల, జూలై 12 (ఆంధ్రజ్యోతి): తాడిపత్రికి చెందిన వ్యక్తి తనను చంపేస్తానని బెదిరిస్తున్నాడని వివేకా హత్య కేసులో ఏ-3 నిందితుడు ఉమాశంకర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుని కథనం మేరకు.. తాడిపత్రికి చెందిన తన బంధువు అయిన రఘునాథరెడ్డికి ఫోన్ చేశానన్నారు. ఫోన్‌లో మాట్లాడుతున్న సమయంలో అతను ఫోన్ కట్ చేసి తన అన్న రమాకాంత్‌రెడ్డికి ఫోన్‌చేసి.. మీ తమ్ముడు వివేకానందరెడ్డి హత్య కేసులో ఉన్నాడని, తోపు అనుకుంటున్నాడేమో అవసరమైతే రెండు రోజుల్లోనే నేను చంపేస్తా అని బెదిరించాడన్నారు. తన అన్న ఈ విషయం చెప్పడంతో శనివారం ఉదయం 11 గంటల సమయంలో ఉమాశంకర్‌రెడ్డి పులివెందుల అర్బన్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనితో ఉమాశంకర్‌రెడ్డి అన్న రమాకాంత్‌రెడ్డిని, రఘునాథరెడిని సీఐ హాజీవల్లి పోలీస్‌స్టేషన్‌కు పిలిచి విచారించారు. అనంతరం వారిని మందలించి పంపినట్లు తెలిసింది. దీనిపై కేసు నమోదు చేయలేదని పోలీసులు తెలిపారు.

మూఢనమ్మకాలపై జేవీవీ పోరాటం

- జేవీవీ వ్యవస్థాపకుడు బ్రహ్మారెడ్డి



జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర సభల్లో మాట్లాడుతున్న బ్రహ్మారెడ్డి

కడప ఎడ్యుకేషన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో నెలకొన్న మూఢనమ్మకాలను తరిమి కొట్టేందుకు జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) అలుపెరగని పోరాటం చేస్తోందని ఆ సంస్థ వ్యవస్థాపకుడు బ్రహ్మారెడ్డి అన్నారు. శనివారం కడప నగరంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర మహాసభలు ప్రారంభమయ్యాయి. జాతీయ పతాకం, జేవీవీ పతాకాల ఆవిష్కరణ, ఉద్యమ గీతాలాపనతో ఈ సభలను ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి, విద్యకు సంబంధించి జనవిజ్ఞాన వేదిక కృషి చేస్తోందన్నారు. ప్రజల్లో సైన్స్ పట్ల చైతన్యం, శాస్త్రీయ దృక్పథం పెరగాలన్నారు. అనంతరం టీడీపీ నేత సి.భూపేశ్‌రెడ్డి మాట్లాడుతూ సమాజంలో నెలకొన్న మూఢనమ్మకాలపై జనవిజ్ఞాన వేదిక ప్రధానంగా పోరాడుతోందన్నారు. భవిష్యత్తులో జనవిజ్ఞాన వేదిక మరింతగా సమాజానికి సేవ చేయాలని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ మాట్లాడుతూ ప్రజలను చైతన్యవంతులను చేయడం, అన్ని రంగాల్లో సంతులిత అభివృద్ధిని సాధించే విధంగా ఉత్సాహపరచడంలో జేవీవీ తనవంతు పాత్ర పోషిస్తోందని అన్నారు. యోగి వేమన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మజ మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక భావిభారత పౌరుల సమగ్ర వికాసానికి తగిన కృషిచేస్తోందన్నారు. కడప మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ కె.రాకేశ్‌చంద్ర మాట్లాడుతూ నేటి బాలలే రేపటిపౌరులని కావున వారి ఆరోగ్యం విద్య కేంద్రీకృతంగా జేవీవీ కృషిచేయాలని అన్నారు. జన చైతన్య సంఘం నాయకులు టి.బ్రహ్మయ్య మాట్లాడుతూ సమాజం కోసం జేవీవీ నాయకులు చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు సురేశ్‌కుమార్ సభకు అధ్యక్షత వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, జాతీయ నాయకులు వి.విశ్వనాథ, కృష్ణాజి, శ్రీనివాసులు, సనావుల్లా, మహమ్మద్ మియా, ఎస్.స్వరాజ్యలక్ష్మి, వెంకట రామిరెడ్డి, బసవన్న, చలపతి, పలువురు ప్రజా సంఘాల నాయకులు, జిల్లా నాయకులు కె.సురేశ్‌బాబు, సుధాకర్, గౌరీశంకర్, మహబూబ్‌బాష తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా గాజుపెంకుల మీద చిన్నారులు నడవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది.



గాజు పెంకులపై నడుస్తున్న చిన్నారి

రేపటి నుంచి రీ సర్వే

- ప్రభుత్వ భూములు, సరిహద్దులు గుర్తింపు
- వైసీపీ హయాంలో రీసర్వేపై 6వేల ఫిర్యాదులు
- వీటిని పరిష్కరించిన చంద్రబాబు ప్రభుత్వం
- ఇప్పటి వరకు 2 విడతల్లో 1.50 లక్షల ఎకరాల్లో సర్వే పూర్తి
- ఆగస్టు నాటికి పాస్‌బుక్‌లపై జగన్ బొమ్మ తొలగింపు



రోవర్స్‌తో సర్వే చేస్తున్న సర్వేయర్లు (ఫైల్ ఫొటో)

కడప కలెక్టరేట్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూ సమస్యల పరిష్కారానికి చంద్రబాబు ప్రభుత్వ రీ సర్వే ప్రక్రియను ముమ్మరం చేసింది. ఏళ్ల తరబడి రీ సర్వే పేరుతో సాగదీత తగదని భావించింది. రైతులకు సంతృప్తి కలిగించే రీతిలో వేగవంతంగా భూముల రీసర్వే పూర్తి చేయనుంది. ఈ నెల 14 నుంచి డిసెంబరు చివరి నాటికి జిల్లా వ్యాప్తంగా 300 గ్రామాల్లో ప్రభుత్వ భూములు, గ్రామ సరిహద్దులు, వంకలు, వాగులు, దేవదాయ, వక్ఫ్, గ్రామ కంఠాల భూములను గుర్తించనుంది.

జగన్ పాలనలో 2020లో శాశ్వత భూ హక్కు-రక్షణ పేరుతో జిల్లాలో 285 గ్రామాల్లో 4.66 లక్షల ఎకరాల భూముల్లో రీసర్వే చేపట్టారు. నాలుగేళ్ల పాటు చేసిన సర్వే అంతా తప్పుల తడకగా సాగడంతో రైతుల నుంచి వ్యతిరేకత వచ్చింది. దీంతో కూటమి సర్కారు అధికారంలోకి రాగానే భూముల రీసర్వేలో తప్పులను సరిదిద్దేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహించింది. ఆ సదస్సుల్లో ఊహించని రీతిలో జిల్లాలో దాదాపు 6వేల ఫిర్యాదులు వచ్చాయి. చంద్రబాబు రైతుల భూ సమస్యలను సీరియస్‌గా తీసుకున్నారు. ప్రభుత్వ భూములు, రైతుల పట్టా భూములు అన్యాక్రాంతం కాకూడదనే గట్టి నిర్ణయానికి వచ్చా రు. ఇందులో భాగంగా జిల్లాలో రెండు విడతల్లో పైలెట్ ప్రాజెక్టు కింద 69 గ్రామాల్లో రీసర్వే పక్కా ప్రణాళికతో నిర్వహించారు. దాదాపు 70వేల ఎకరాల్లో సాగిన రీసర్వేలో రైతుల నుంచి ఎలాంటి అసంతృప్తులు, ఫిర్యాదులు రాకపోవడంతో శరవేగంగా రీ సర్వేను పూర్తిచేసేందుకు ప్రభుత్వం కసరత్తు ముమ్మరం చేసింది. ఇప్పటి వరకు జరిగిన సర్వేలో రైతుల సందేహాలు నివృత్తి చేస్తూనే, వాళ్లు కోరితే శాటిలైట్ పద్ధతిలో రోవర్స్‌తోనే కాకుండా గొలుసు (లింకు) పద్ధతిలో సర్వే చేసేందుకు సర్వే యంత్రాంగం సిద్ధమైంది.

354 గ్రామాలో రీసర్వే పూర్తి


జిల్లాలో 735 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. ఈ రెవెన్యూ గ్రామాల పరిధిలో 22,36,545 ఎకరాల భూవిస్తీర్ణం ఉంది. అయితే 84 గ్రామాల పరిధిలో భూముల రీసర్వేకు అవకాశం లేదు. రిజర్వాయర్లు, మున్సిపాలిటీల పరిధిలో భూముల లెక్కలు తేలడం అసాధ్యమంటారు. ఇక 651 గ్రామాల్లో మాత్రమే భూముల రీసర్వే జరగాల్సి ఉంది. అందులో వైసీపీ సర్కారులో నాలుగేళ్ల కాలంలో 282 గ్రామాల్లో 4.66 లక్షల ఎకరాలు, కూటమి సర్కారు ఏడాది పాలనలో రెండు విడతల్లో 69 గ్రామాల్లో 1.50 లక్షల ఎకరాల భూములకు రీసర్వే పూర్తి చేశారు. మిగిలిన 300 గ్రామాల్లో నాన్పుడి ధోరణితో కాకుండా వీలైనంత త్వరలో ప్రభుత్వ, పట్టా భూముల లెక్కలు తేల్చి భూసమస్యలకు శాశ్వతంగా చెక్ పెట్టనున్నారు.

రీసర్వేకు 473 మంది సర్వేయర్లు

జిల్లాలో ఈనెల 14 నుంచి ప్రారంభం కానున్న రీసర్వేలో దాదాపు 473 మంది సర్వే యర్లు, సిబ్బంది పాల్గొంటారు. 423 సచివాలయాల సర్వేయర్లు, మరో 50 మంది వరకు మండల, డివిజన్ సర్వేయర్లు పాల్గొంటారు. మొదట ప్రభుత్వ భూములు, గ్రామ సరిహద్దు రాళ్లను పకడ్బందీగా గుర్తించనున్నారు. అనంతరం గ్రామాల వారీగా రైతుల భూములను రోవర్స్‌తో సర్వే చేయనున్నారు. ఇప్పటికే జిల్లా కేంద్రంలో దాదాపు 160 రోవర్స్ సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది.

రాజముద్రతో పాస్ పుస్తకాలు

గత ప్రభుత్వ హయాంలో సొమ్మొకడిది సోకొకడిదీ అన్నట్లుగా రైతులకు సంబంధించిన భూహక్కు పత్రాలపై జగన్ ఫొటోలతో ముద్రించిన పాస్ పుస్తకాలను ఇచ్చారు. కూటమి సర్కారు వీటిని రద్దు చేసి భూహక్కు పత్రాలను రాజముద్రతో రైతులకు ఆగస్టు నాటికి అందజేయనుంది.



> **ఎన్నిసార్లయినా సర్వే చేస్తాం**
>
> భూముల రీసర్వే సమయంలో రైతులకు సందేహాలు ఉంటే నివృత్తి చేస్తాం. రైతు సంతృప్తి చెందేంత వరకు ఎన్నిసార్లయినా రీసర్వే చేస్తాం. ఇకపోతే ఓవర్స్‌తో సర్వే వద్దంటే గొలుసు పద్ధతిలో సర్వే చేసేలా సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం. జిల్లాలో 14వ తేదీ నుంచి ప్రారంభం కానున్న రీసర్వేలో 300 గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ భూములు, గ్రామాల సరిహద్దులను గుర్తిస్తాం.
>
> - మురళీకృష్ణ, భూముల రికార్డులు, కొలతలశాఖ అసిస్టెంట్ డైరెక్టర్

టిప్పర్ ఢీ.. ఒకరి మృతి

● మరొకరికి తీవ్ర గాయాలు ● సంతకు వెళుతుండగా ప్రమాదం



బాల నాగయ్య మృతదేహం, టిప్పర్ ఢీకొన్న చోట ప్రమాద దృశ్యం

దువ్వూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మేకపిల్లను విక్రయించేందుకు సంతకు వెళుతుండగా టిప్పర్ ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన దువ్వూరు మండలం క్రీస్తురాజపురం నాలుగు రోడ్ల వద్ద జరిగింది. ఎస్‌ఐ వినోద్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.... రాజుపాళెం మండలం వెలువలి గ్రామానికి చెందిన బాలనాగయ్య (42), హుసేనయ్య (60) శనివారం ఉదయం బైకుపై మేకపిల్లను తీసుకుని మైదుకూరు సంతకు బయల్దేరారు. దువ్వూరు సమీపంలోని క్రీస్తు రాజపురం వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొంది. దీంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని అంబులెన్స్‌లో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స చేస్తుండగా బాలనాగయ్య ప్రాణాలు కోల్పోయాడు. హుసేనయ్య చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు కేసు నమోదు అయిందని టిప్పర్‌ను అదుపులోకి తీసుకున్నామని ఎస్‌ఐ వివరించారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

ఓబులవారిపల్లె, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కడప-చెన్నై జాతీయ రహదారిలో చిన్నఓరంపాడు వద్ద కారు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ఐ మహేష్ తెలిపారు. చెన్నూరుకు చెందిన సోమశిల శ్రీనివాసులు (50) తమలపాకు తోటల్లో పనులు చేస్తూ ఉండేవారు. హోటల్‌కు మధ్యాహ్నం భోజనానికి టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై వెళుతుండగా హైదరాబాద్ నుంచి తిరుమల వెళుతున్న ఇన్నోవా వాహనం ఢీకొనడంతో కాళ్లు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో రాజంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడని తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆవు దాడిలో మహిళ...



లక్కిరెడ్డిపల్లె, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఆవు దాడి చేయడంతో సుజాతమ్మ (45) అనే మహిళ శనివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సుజాతమ్మ జెర్సీ ఆవుల పోషణతో జీవించేది. శనివారం ఉదయం ఆవులను మేపుకోసం వదిలి కాపలా కాస్తుండగా, అదే ప్రాంతంలో మేస్తున్న మరో ఆవు ఆమెపై దాడి చేసి కొమ్ములతో పొడిచింది విషయం గమనించిన పశువుల కాపరులు ఆమెను రాయచోటిలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరు..



లక్కిరెడ్డిపల్లె, జూలై 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ సరిచేస్తుండగా షాక్ కొట్టడంతో రాబిన్ బంధ్ర (23) అనే యువకుడు మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. విద్యుత్ లైన్ పనుల నిమిత్తం జార్ఖండ్ నుంచి వచ్చిన కొంత మంది రామాపురం, లక్కిరెడ్డిపల్లె మండలాల్లో విద్యుత్ లైన్ పనుల్లో కూలీలుగా పనిచేస్తున్నారు. శనివారం మండలంలోని దిన్నెపాడు సమీపంలోని ఎర్రంరెడ్డిగారిపల్లె వద్ద విద్యుత్ వైర్లు సరిచేస్తుండగా రాబిన్ బంధ్ర అనే యువకుడు విద్యుత్ షాక్‌కు గురై కిందపడిపోయాడు. స్థానికులు అతనిని లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులుతెలిపారు.

26 బస్తాల చౌక బియ్యం పట్టివేత

చెన్నూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు పోలీసుస్టేషను పరిధి పాలెంపల్లె రైసుమిల్లు సమీపంలో 26 బస్తాల చౌక బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు.. అక్రమంగా తరలించేందుకు బియ్యం బస్తాలు సిద్ధంగా ఉన్నాయని అందిన సమాచారంతో శనివారం సీఐ క్రిష్ణారెడ్డి సిబ్బందితో దాడి చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. దేవిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

అనంతపురం జిల్లా యాడికి మండలంలో ఘటన



ద్విచక్రవాహనం అదుపు తప్పి వ్యవసాయ పొలంలో పడ్డ విజయభాస్కర్‌రెడ్డి



విజయభాస్కర్‌రెడ్డి మృతదేహం

యాడికి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరు మృతి చెందిన సంఘటన శనివారం ఉదయం అనంతపు రం జిల్లా యాడికి మండలం దైవాల మడుగు- చందన గ్రామాల మధ్య జరిగింది. ఈ సంఘటనలో కడప జిల్లా సింహాద్రిపురం మండలం చెర్లోపల్లి గ్రామానికి చెందిన విజయ భాస్కర్ రెడ్డి (43) మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు చెర్లోపల్లికి చెందిన విజయభాస్కర్‌రెడ్డి నంద్యాల జిల్లా ప్యాపిలి వద్ద ఉన్న అరుణా చలేశ్వర ట్రాన్స్‌పోర్ట్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈక్రమంలో 20రోజులకు ఒకసారి చెర్లోపల్లి గ్రామానికి వెళ్లి వస్తుండేవాడు. శనివారం ఉదయం విధు లను ముగించుకొని సొంత గ్రామానికి ద్విచక్రవాహనంపై బయ ల్దేరాడు. దైవాలమడుగు- చందన గ్రామాల మధ్య రోడ్డు మలుపు వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పింది. దీంతో విజయభాస్కర్‌రెడ్డి వ్యవసాయ పొలంలోకి ఎగిరిపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అత డు అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలి పారు. మృతుడి భార్య అమరావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రికి తరలించారు. మృతుడికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

గుభాళించని పూలు

●పీడిస్తున్న తెగుళ్లు, ఆశించిన ధరల్లేక... ● నిరాశ వ్యక్తం చేస్తున్న పూల రైతులు



కానగూడూరు మార్కెట్‌లో పూల క్రయ విక్రయాలు



కుప్పలుగా పోసిన మల్లెలు

దువ్వూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పండుగలు, పెళ్లిళ్లు, శుభకార్యాలు, ఇతరత్రా వేడుకలకు పూలను వాడటం సాంప్రదాయంగా వస్తోంది. పూల పరిమళంతో పులకించని తనువు, మనుషులు ఉండరనడంలో అతిశయోక్తి లేదు. ఇలాంటి పూల పంట సాగు చేస్తున్న రైతు బతుకు మాత్రం గుభాళించడంలేదు. ధరలు ఆశాజనకంగా లేకపోవడంతో నష్టాల పాలవుతున్నారు.

దువ్వూరు మండలంలో కానగూడూరు ప్రాంతం పూల సాగుకు పెట్టింది పేరు. అలాగే క్రిష్ణంపల్లె, ఇడమడక, జిల్లేళ్ల, టంగుటూరు గ్రామాల్లో వివిధ రకాల పూలు సాగు చేస్తారు. వీటిని కానగూడూరు గ్రామానికి తెచ్చి అక్కడున్న మార్కెట్‌లో విక్రయిస్తారు. ఇక్కడ నుంచి హైదరాబాదు, కర్నూలుకు కూడా పూలను తరలిస్తారు. మల్లెలు, సంపెంగి, జాజిపూలతోపాటు రెడ్ రోజా సాగు చేస్తారు. వ్యయప్రయాసల కోర్చి 200 ఎకరాలు దాకా ఈ ప్రాంతంలో సాగు చేశారు.

వేధిస్తున్న తెగుళ్లుతో...

పూల సాగు చేసిన రైతులు ఎక్కువగా పండుగల సమయంలో లాభాలు గడిస్తారు. ప్రస్తుతం తోటల్లో రేగ్గాయిపురుగు, త్రిప్స్, తెల్లదోమ, ఎర్రదోమ లాంటి తెగుళ్ల ఆశిస్తున్నాయని రైతులు వాపోతున్నారు. తెగుళ్లతో మల్లెతోటల్లో ఎర్రమొగ్గ ఏర్పడి దిగుబడిపై ప్రభావం చూపుతోంది. వీటి నివారణకు పలుసార్లు మందులు పిచికారి చేస్తున్న నియంత్రణ కావడం లేదని వాపోతున్నారు. పంట దిగుబడి చేతికందాలంటే ఆరు దఫాలుగా పిచికారి చేయాల్సి వస్తోందంటున్నారు. దీనికి రూ.12వేలు దాకా ఖర్చు వస్తోందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో అందిన దిగుబడి, మార్కెట్‌లో విక్రయాలతో సరిచూసుకుంటే లాభాలు ఆశాజనకంగా లేవని పూల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కిలోలు చొప్పున సీజన్‌ను బట్టి మల్లెల ధర కిలో రూ.150, జాజి కిలో రూ.170, సంపెంగి రూ.50, రెడ్‌రోజా రూ.100 ధర పలుకుతున్నాయి. ఒక్కోసారి ఆ ధర మరికొంత పెరుగుతున్నా గిట్టుబాటు కావడం లేదని రైతుల ఆవేదన.

ధరలు నిరాశ పరుస్తున్నాయి



పూల ధరలు నిరాశ పరుస్తున్నాయి. తెగుళ్ల నివారణకు మందులు పిచికారి చేస్తున్నా పెద్దగా ప్రభావం కనిపించడంలేదు. 15 ఏళ్లుగా పూల సాగు చేస్తున్నాను. కొన్నిసార్లు మంచి లాభాలు వచ్చాయి. ఇప్పుడు కూలీ లు, మందుల ఖర్చులు ఎక్కువగా వస్తున్నా యి. దీంతో ఆదాయం అందని ద్రాక్షలా మారింది. ఒకటిన్నర ఎకరంలో మల్లెలు సాగు చేశాను. రోజువారీగా పూలు కోసి అమ్మితే ఇంటి ఖర్చులకు వస్తోంది.

- సూర్యనారాయణ, పూల రైతు, కానగూడూరు

అంతర్‌రాష్ట్ర గజదొంగ అరెస్ట్

● 102 గ్రాముల బంగారం, రూ.75 వేలు నగదు స్వాధీనం ● వివరాలు వెల్లడించిన అదనపు ఎస్పీ వెంకటాద్రి





వివరాలు వెల్లడిస్తున్న అదనపు ఎస్పీ, స్వాధీనం చేసుకున్న బంగారు నగలు, నగదు

రాయచోటిటౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పలు రాష్ట్రాల్లో చోరీలకు పాల్పడుతున్న రంగనాథం కిరణ్ అనే వ్యక్తిని అన్నమయ్య జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. శనివారం రాయచోటి పట్టణంలోని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి వివరాలను వెల్లడించారు. ఉమ్మడి పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని గూడూరు పట్టణం గాంధీనగర్‌కు చెందిన రంగనాథం కిరణ్ అనే వ్యక్తి బేకరీలో పని చేసేవాడు. అక్కడ వచ్చే డబ్బు వ్యసనాలకు చాలకపోవడంతో బస్టాండు, రద్దీగా ఉండే ప్రాంతాల్లో చోరీలు చేసేవాడు. క్రమంగా ఇళ్లలో చోరీలకు అలవాటుపడ్డాడు. అన్నమయ్య జిల్లా పరిధిలోని వీరబల్లి, చిట్వేలు, రైల్వేకోడూరు ప్రాంతా ల్లో చోరీలు చేశాడు. రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్, రూరల్ సీఐ వరప్రసాద్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, సబ్‌ఇన్‌స్పెక్టర్ రామకృష్ణారెడ్డి, వీరబల్లి ఎస్‌ఐ నరసింహారెడ్డిల ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి శనివారం వీరబల్లి మండలం ఓదివీడు గ్రామం క్రాస్ వద్ద నిందితుడిని అరెస్టు చేసి 10 లక్షల విలువ చేసే 102 గ్రాముల బంగారు నగలు, రూ.75వేలు నగదు స్వాధీనం చేసుకుని, కోర్టులో హాజరుపెట్టినట్లు అదనపు ఎస్పీ తెలిపారు. నిందితుడు అన్నమయ్య జిల్లాతో పాటు, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, విశాఖపట్నం, ఎన్టీఆర్, కృష్ణ, రాజమహేంద్రవరం, గుంటూరు, తిరుపతి, ప్రకాశం, ఏలూరు, కాకినాడ జిల్లాల్లో మొత్తం 60 కేసుల్లో నిందితుడుగా ఉన్నట్లు తెలియజేశారు. ఇతర రాష్ట్రాల్లో కూడా దొంగతనాలకు పాల్పడినట్లు నిందితుడు అంగీకరించాడని వివరించారు. ఈసందర్భంగా పోలీసు అధికారులను, సిబ్బందిని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు అభినందించినట్లు తెలిపారు.

నేటి నుంచి అండర్-16 మెన్స్ మల్టీడే క్రికెట్ మ్యాచ్‌లు

కడప స్పోర్ట్స్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కడపలో ఈనెల 13వ తేదీ ఆదివారం నుంచి ఈనెలాఖరు వరకు ఏసీఏ అండర్-16 మెన్స్ మల్టీడే (మూడురోజుల) క్రికెట్‌మ్యాచ్‌లు జరుగ నున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ తెలిపారు. ఇందులో కడప, కర్నూలు, నెల్లూరు, చిత్తూరు, అనంతపురం జిల్లాలకు చెందిన క్రికెట్ జట్లు పాల్గొంటు న్నాయన్నారు. తొలుత కర్నూలు-నెల్లూరు, కడప-చిత్తూరు జట్ల మధ్య 13వ తేదీ నుంచి 15 వరకు మ్యాచ్‌లు జరుగుతాయన్నారు. 17 నుంచి 19వ తేదీ వరకు కడప- కర్నూలు, అనంతపురం-నెల్లూరు జట్ల మధ్య పోటీలు ఉంటాయని తెలిపా రు. 20న ఆటకు విశ్రాంతి దినం. 21 నుంచి 23 వరకు అనంతపురం- చిత్తూరు, కడప-నెల్లూరు జట్ల మధ్య మ్యాచ్‌లు సాగుతాయన్నారు. 24న ఆటకు విశ్రాంతి దినం, 25 నుంచి 27 వరకు చిత్తూరు-నెల్లూరు, అనం తపురం- కర్నూలు జట్ల మధ్య పోరు సాగుతుందన్నారు. 28వ తేదీ ఆటకు విశ్రాంతి. చివరగా 29 నుంచి 31 వరకు అనంతపురం-కడప, చిత్తూరు- కర్నూలు జట్ల మధ్య మ్యాచ్‌లు జరుగుతాయని తెలిపారు

తల్లిదండ్రులకు బాలిక అప్పగింత

పీలేరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పీలేరు పట్టణం బండ్లవంక నుంచి ఈనెల 6న అదృశ్యమైన జోష్ణవిని పీలేరు పోలీసులు శని వారం గుర్తించారు. హాస్టల్ వెళ్లాలన్న బెంగతో ఆ బాలిక భయపడి ఇంటి నుంచి పారిపోయి తిరుమలకు చేరుకుంది. అక్కడ పలు మార్లు దైవదర్శనానికి వెళుతుండడాన్ని గమనించిన విజిలెన్స్ అధికారులు ఆమెను విచారించగా ఇంటి నుంచి పారిపోయి వచ్చినట్లు తెలిసింది. దీంతో వారు పీలేరు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పీలేరు పోలీసులు ఆమెను తీసుకువచ్చారు. పీలేరు సర్కిల్ కార్యాలయంలో ఆమెను ఆమె తల్లిదండ్రులకు అప్పగించారు.

పోక్సో కేసులో యువకుడు అరెస్టు : డీఎస్పీ వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మురళీనాయక్

వేంపల్లె, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో మాయ మాటలు చెప్పి ఓ మైనర్ బాలికను నమ్మించి మోసం చేసిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ మురళీ నాయక్ తెలిపారు. శనివారం వేంపల్లె పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వేంపల్లె మండలం పక్కీరుపల్లెకు చెందిన మడక బాబు, బాలిక మూడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 7వ తేదీ మేకలు మేపుకునేందుకు బాలిక వెళ్లింది. అక్కడ నుంచి మడక బాబుకు ఫోన్ చేసి రావాలని కోరగా యువకుడు వెళ్లాడు. ఆ సమయంలో తండ్రి రావడంతో బాలిక యువకుడిని వెళ్లిపోవాలని చెప్పి భయంతో అడవిలోకి పారి పోయింది. దీంతో బాలిక తల్లిదండ్రులు తమ కుమార్తె కనిపించడం లేదని ఫిర్యాదు చేశారు. అనుమానాస్పదంగా కనిపించిన మడక బాబు, అతని స్నేహితులను పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి విచారిస్తుండగా... బాలిక తరపు బంధువులు పోలీసు స్టేషన్‌ను ముట్టడించి తీవ్ర గందరగోళం సృష్టించారు. రాత్రికి బాలిక ఆచూకీ లభ్యం కావడంతో రిమ్స్‌కు తరలించి చికిత్స చేయించారు. మహిళా ఎస్‌ఐ జ్యోతి బాలిక నుంచి వివరాలు సేకరించగా ఇరువురు మూడేళ్లుగా ప్రేమలో ఉన్నామని వెల్లడించింది. మైనర్ బాలిక అయినందున యువకుడిపై పోక్సో కేసు నమోదు చేశామన్నారు. చక్రాయపేట బస్టాండ్ వద్ద ఉండగా శనివారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. కాగా, బాలిక అదృశ్యం ఘటన నేపథ్యంలో పోలీస్‌స్టేషన్ ముట్టడించిన వారిపై కేసు నమోదు విషయంపై ఎస్పీ అశోక్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లి చర్చిస్తామన్నారు. న్యాయ సలహా తీసుకున్న తర్వాత కోర్టులో అప్పీల్ చేస్తామన్నారు. సీఐ నరసింహులు, ఎస్‌ఐలు తిరుపాల్ నాయక్, రంగారావు పాల్గొన్నారు.

అనుమానాస్పద కేసును ఛేదించిన పోలీసులు



నిందితురాలితో సీఐ మోహన్, పోలీసులు

ఖాజీపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పనపల్లె గ్రామానికి చెందిన నక్కా శ్రీనివాసులు అనుమానాస్పద మృతి కేసును ఛేదించినట్లు సీఐ మోహన్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఖాజీపేటలో శనివారం విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. అప్పనపల్లెకు చెందిన నక్కా శ్రీనివాసులుకు ఇరువురితో వివాహం జరిగింది. మొదటి భార్య లక్ష్మీదేవి వదిలిపెట్టి వెళ్లడంతో చాపాడుమండలం తిప్పిరెడ్డిపల్లెకు చెందిన సునీతను 13 సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్నాడు. మద్యం మత్తులో పిల్లల ముందే తనను కొడుతుండగా.. ఆమె ఒక్కసారిగా తోయడంతో పక్కన ఉన్న మంచుకోడు తగులుకుని కింద పడ్డాడు. అయితే భర్త లేస్తే తనను చంపుతాడన్న భయంతో తిరిగి మంచంకోడుకు తలను కొట్టడంతో మృతి చెందాడు. కాగా ఈ విషయం బయటకు వస్తే పిల్లలు అనాథలు అవుతారని ఉరి వేసుకుని చనిపోయాడని నమ్మించి... మొదటి భార్య లక్ష్మీదేవికి సమాచారం ఇవ్వకుండా జూన్ 12వ తేదీ దహన కార్యక్రమాలు నిర్వహించారు. అయితే మొదటి భార్య అనుమానం వ్యక్తం చేసి జూలై 1వ తేదీ ఫిర్యాదు చేయగా 2వ తేదీ తహసీల్దారు, రిమ్స్ డాక్టర్లు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. ఎక్కడ నిజం బయట పడుతుందోనని అతని రెండో భార్య సునీత స్థానిక సచివాలయంలో పనిచేసే సెక్రటరీ భాగ్యశ్రీని కలిసి నిజం చెప్పడంతో ఆమేరకు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సునీతను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు సీఐ మోహన్ తెలిపారు.

బొంగుబజార్‌లో అగ్నిప్రమాదం

● పాత టైర్లు, ప్లాస్టిక్ సంచులు దగ్ధం

ప్రొద్దుటూరు ,జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లె పంచాయతీలోని బొంగుబజార్‌లోని ఖాళీ ప్రదేశంలో వేసిన వ్యర్థాలు అంటుకొని పెద్దఎత్తున మంటలు వ్యాపించాయి. శనివారం మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో బొంగు బజార్‌కు సంబంధించిన పాతటైర్లు, ప్లాస్టిక్ సంచులు, ప్లాస్టిక్ బాటిల్స్ అగ్ని ప్రమాదంలో కాలి బూడిదయ్యాయి. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సహాయ అధికారి బసివి రెడ్డి తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఇతర ప్రాంతాలకు వ్యాప్తి చెందకుండా అదుపులోకి తెచ్చారు. ఈ పాత సామాను అంతా మహ్మద్ ఫరూక్ అనే వ్యక్తికి సంబంధించినవి. వీటి విలువ రూ.5లక్షలు ఉంటుందని యజ మాని తెలిపారన్నారు. ఎవరో అజాగ్రత్తగా తాగిపడేసిన బీడీ సిగరేట్ వలన అగ్నిప్రమాదం సంభవించి ఉండవచ్చని అధికారులు వెల్లడిస్తున్నారు





మంటలు ఎగిసిపడుతున్న దృశ్యం, ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

చిలేకాంపల్లెలో దేవర ఎద్దు మృతి



దేవర ఎద్దు వద్ద నివాళులు అర్పిస్తున్న మహేశ్వరరెడ్డి, గ్రామస్థులు

చక్రాయపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): చిలేకాంపల్లె గ్రామం వడ్డెపల్లెకు చెందిన దేవర ఎద్దు మృతి చెందింది. గత 30 సంవత్సరాలుగా పూజలు అందుకుంటున్న దేవర ఎద్దు చనిపోవడంతో గ్రామస్థులు కంటతడి పెట్టారు. మూడేళ్ల క్రితం ఇక్కడ దేవర కూడా జరిగింది. ఇటీవల పందిళ్లపల్లె గ్రామంలో, ఎరబాలపల్లెలో జరిగిన దేవరలో ఈ ఎద్దుకు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో దేవత లాంటి ఎద్దు చనిపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆవేదనకు గురయ్యారు. మండల టీడీపీ అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి తాల్లపల్లె మహేశ్వర్‌రెడ్డి, పెద్దమామిరెడ్డిగారి మామిరెడ్డి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు పాల్గొన్నారు.

వినియోగదారులకు ఇకపై విద్యుత్ సమస్యలుండవు

ఎటువంటి అసౌకర్యం కలిగినా తక్షణం స్పందిస్తాం

ట్రాన్స్‌కో ఏఈ రామలింగారెడ్డి

చెన్నూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : మండల వ్యాప్తంగా అన్ని సబ్‌స్టేషన్ల పరిధిలో ఎలాంటి విద్యుత్ సమస్యలున్నా వాటిని పరిష్కరించడం, ఎలాంటి అసౌకర్యం కలిగినా తక్షణం స్పందించడం జరుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ రామలింగారెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సబ్‌స్టేషనులో మాట్లాడుతూ ఇప్పటి వరకు వినియోగదారులు విద్యుత్ సరఫరాలో చిన్నపాటి అంతరాయం కలిగినా ఫోను చేస్తున్నారని ఒక్కోమారు ఎక్కువ మంది ఒకేసారి ఫోను చేయడంతో అందరికీ సమాధానం చెప్పాలంటే కష్టతరమవుతుందని ఇకపై సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి పంచాయతీలో లైన్‌మెన్ నిత్యం అందుబాటులో ఉండేవిధంగా ఆయన ఫోను నెంబరు, పేరును, పనిచేసే సబ్‌స్టేషను నెంబరు ఇస్తున్నామని తెలిపారు. ఆ ప్రాంత పరిధిలో పనిచేసే లైన్‌మెనుకు ఏ సమస్య ఉన్నా తెలిపి తక్షణం పరిష్కరించుకోవచ్చన్నారు. ఇందుకోసం చెన్నూరు టౌన్, బుడ్డాయపల్లె సంబంధించి సబ్‌స్టేషను నెంబరు 9490615140గా ఉందన్నారు. కొండపేట, కనుపర్తి, బలసింగాయపల్లె గ్రామాల కనుపర్తి సబ్‌స్టేషను నెంబరు 9490615141, రామనపల్లె, రాచిన్నాయపల్లె, ముండ్లపల్లె, చిన్నమాచుపల్లె గ్రామాలు చెన్నూరు సబ్‌స్టేషను కిందికి వస్తాయన్నారు. కొక్కిరాయపల్లె, శివాలపల్లె, గోపవరం, నరసారెడ్డిపల్లె గ్రామాలకు 9160157109, అలాగే శాటిలైట్ సిటీ సబ్‌స్టేషను నెం.9490612062, ఆలంఖాన్‌పల్లె, దండు, ఫ్రెండ్స్‌కాలనీ, పూలోనిపల్లె గ్రామాలు శాటిలైట్ సిటీ సబ్‌స్టేషను 9398753579, సాయిపేట సబ్‌స్టేషను నెంబరు 9490615133 ఈ సబ్‌స్టేషను పరిధిలో పాలెంపల్లె, రూకవారిపల్లె, బచ్చుంపల్లె గ్రామాలు వస్తాయన్నారు. వీటితో పాటు ఓబులంపల్లె, వాటర్‌గండి, గుర్రంపాడు, నజీర్‌బేగ్‌పల్లె గ్రామాలు పాత కడప సబ్‌స్టేషన్ పరిధిలోకి వస్తాయని ఈ సబ్‌స్టేషను నెం.9490615143. ఈ నెంబర్లకు వినియోగదారులు తమ సమస్యలను కాల్ చేసి తెలిపి ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవాలని తెలిపారు. ఒకవేళ పై నెంబర్లలో ఏ ఒక్కరూ స్పందించకపోయినా చెన్నూరు సబ్‌స్టేషన్ ఏఈ రామలింగారెడ్డి సెల్.9440811925 నెంబరుకు ఫోను చేసి పరిష్కారం పొందాలని ట్రాన్స్ కో ఏఈ తెలిపారు.

రోడ్డు దాటేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి

ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి

కొండాపురం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) వాహనదారులు, పాదా చారులు రోడ్డు దాటేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని కొండాపురం ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. శనివారం సాయం త్రం స్థానిక ప్రజలకు నేషనల్ హైవేపై రోడ్డు భద్రతా నియ మాలపై అవగాహన కల్పించారు. అతివేగం ప్రమాదకరమని, రోడ్డు దాటేటప్పుడు వాహనాలను గమనించాలని కోరారు. ముఖ్యంగా యువత స్పీడుగా వెళ్లకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని కోరారు. వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్, సీటుబెల్టు ధరించాలని ఎస్ఐ తెలిపారు.

నేటి మహా శోభాయాత్రకు హిందువులు తరలిరండి

కడప కల్చరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు కడపలో తలపెట్టిన సనాతన ధర్మ పురోహిత మహా శోభాయాత్రను విజయవంతం చేసేందుకు హిందువులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఏపీ పురోహిత బ్రాహ్మణసమాఖ్య జిల్లా ప్రధానకార్యదర్శి వారణాసి శ్రీధర్‌శర్మ, జిల్లా అర్చకసంఘం నాయకుడు పిడతల గోపాలకృష్ణశర్మ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఆకులవీధిలోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మృత్యుంజయకుంట శివాలయం నుంచి యాత్ర ప్రారంభమై అన్నమాచార్య సర్కిల్ వరకు సాగుతుందన్నారు. హిందువులు తప్పక యాత్రలో భాగస్వాములు కావాలని కోరారు.

రేపు పురోహిత పరీక్షలు

కడప కల్చరల్,జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీ సోమవారం 9 గంటలకు నగర మద్రాస్‌రోడ్డు లోని విష్ణు కళ్యాణమండపంలో పురోహిత స్మార్త పంచమ విద్వత్ మహాసభ పురోహిత పరీక్షలు జరుగనున్నట్లు సమాఖ్య జిల్లా ప్రధానకార్యదర్శి వారణాసి శ్రీధర్‌శర్మ, జిల్లా అర్చకసంఘం నాయకుడు పిడతల గోపాలకృష్ణశర్మ తెలిపారు. పై పరీక్షలకు ఎటువంటి రుసుం చెల్లించనవసరం లేదన్నారు. పరీక్షకు హాజరయ్యే పురోహితులు ఆన్‌లైన్ ద్వారా తొలుత తమ పేరు నమోదు చేసుకోవాలన్నారు. పరీక్షానంతరం అదేరోజు సాయంత్రం 4 గంటలకు పట్టా ప్రదానోత్సవం జరుగనుందన్నారు.

అర్చక పరీక్షలకు ప్రభుత్వ గుర్తింపు ఉందా..?

బ్రాహ్మణ చైతన్యవేదిక జిల్లా నాయకులు రఘునందనరావు, ప్రసాదరావు

వేంపల్లె, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కడపలో నిర్వహించనున్న అర్చక పరీక్షలకు ప్రభుత్వ గుర్తింపు ఉందా అని బ్రాహ్మణ చైతన్యవేదిక జిల్లా నాయకులు రఘునందనరావు, ప్రసాదరావు ఒక ప్రకటనలో ప్రశ్నిం చారు. గుర్తింపు లేకుండా పరీక్ష నిర్వహించిన ఆ సర్టిఫికేట్‌తో ఉపయోగం ఉండదని తెలిపారు. పీఠాధిపతులు అంటే అందరికి గౌరవం, వారు ప్రభుత్వ నిబంధనలు అనుసరించి పరీక్షలు నిర్వహిస్తే బాగుంటుందని వారు సూచించారు.

నల్లింగాయపల్లె సొసైటీ నూతన పాలకవర్గం ఎంపిక



కమలాపురం రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని నల్లింగాయపల్లె వ్యవసాయ సహకార సంఘ నూతన అధ్యక్షుడిగా సుధాకర్ రెడ్డిని ఎంపిక చేశారు. మండల పరిధిలోని పలు సొసైటీలకు సింగిల్‌విండో ప్రెసిడెంట్లను ప్రకటించింది. అందులో భాగంగా ఆయన నల్లింగాయపల్లె సొసైటీ అధ్యక్షుడిగా శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈయనతో పాటు కమిటీ మెంబర్లుగా గుజ్జుల సుబ్బారెడ్డి, బోదం నాగమల్లారెడ్డి ఎన్నికయ్యారు. వీరి చేత డీసీసీ బ్యాంకు సూపర్‌వైజరు వీరశేఖర్, చీఫ్ మేనేజరు టీబీ సుబ్బారెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రమాణ స్వీకారం అనంతరం శాలువా, బొకేలతో సొసైటీ కార్యదర్శి బి.శ్రీనివాసులు సిబ్బంది వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీసీ క్రిష్ణయ్య, సొసైటీ సంబంధించిన రైతులు, అధికారులు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అదును పోతోంది..!

పదును లేక బీడుగామారిన ఆయకట్టు భూములు ● అంతరించిపోతున్న వేరుశనగ



దుక్కులకు నోచుకోకపోవడంతో బీడుగా మారిన ఆయకట్టు భూములు

చక్రాయపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): చక్రాయపేట మండలం కరువు కాటకాలకు నిలయం. వర్షాలు రాకపోవడంతో పంటలు ఎండిపోవడం రైతులు అప్పులపాలు కావడం ఇది సహజంగా జరుగుతూనే ఉంది. ఈఏడాదికూడా అదే తంతు జరుగుతోంది. ఆరుద్ర కార్తె పోతున్నా ఇంత వరకు పదును లేకుండా పోవడం అంటే ఆశ్చర్యకరం ఫలితంగా భూములు, ఆయకట్టు భూములు సైతం బీళ్లుగా మారిపోయాయి.అంతేకాకుండా చక్రాయపేట మండలంలో వేరుశనగపంట విరివిగా సాగు చేసేవారు. కానీ ఈ ఏడాది కనుచూపుమేరకు వేరుశనగ కనిపించలేదు. మండలంలో ప్రధానమైన పంటల్లో మామిడి, వేరుశనగ, వరి. వేరుశనగ పూర్తిగా ఎత్తిపోయింది. మామిడిపంట కూడా ఈ ఏడాది పూర్తిగా పోయి రైతులు భారీగా నష్టపోయారు. మండలంలో సకాలంలో వర్షాలు రాక ఇంతవరకు ఎక్కడే గానిపొలాలు దున్నినపాపాన పోలేదు. అరకొరగా దున్నినా కంది, అలసంద, ఆముదం లాంటి పంటలు వేయడానికి అక్కడక్కడ దుక్కులు చేశారు. కానీ ఆకాశం వైపు చూస్తున్నా ఫలితం లేదు. అక్కడక్కడ రైతులు దుక్కులుచేసి వేరుశనగ కాయలు ఒలిచిపెట్టుకున్న భూమిపై చికునుపడకపోవడంతో ఆకాశం వైపు చూస్తున్నారు. మండలంలోని ఎర్రగుడి, చిలేకాంపల్లె, గడ్డంవారిపల్లె, గొట్లమిట్ల తదితర ప్రాంతాలలో దారుణమైన పరిస్థితి ఏర్పడింది. వర్షాలు లేకభూగర్భజలాలు పూర్తిగా అడుగంటిపోయాయి. ప్రస్తుతం కూలి పనులు లేక రైతులుపట్టణాలను ఆశ్రయిస్తున్నారు.కేవలం ఉపాధి హామీ పనులు గంట రెండు గంటలుచేసి ఊరుకుంటున్నారు. వేరుశనగ పంట పూర్తిగా ఎత్తిపోతే వేయలేకపోతే దారుణమైన పరిస్థితి ఎదురవుతాయి. ప్రభుత్వం రైతులకు వెంటనే సహాయం చేయాలని, పంటల బీమా మంజూరు చేయాలని,మామిడి పంటలకు బీమా ఇప్పించాలని కోరుతున్నారు.

17న సర్వసభ్య సమావేశం

సీకేదిన్నె, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 17వ తేదీ చింతకొమ్మదిన్నె మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కుళాయిబాబు తెలిపారు. 17వ తేదీ ఉదయం 10.30 గంటలకు చింతకొమ్మదిన్నె ఎంపీడీవో మండల పరిషత్ సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని, మండల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు గురించి సమావేశంలో చర్చించి తీర్మాణం తీసుకోవడం జరుగుతుందన్నారు.

అగ్నిప్రమాదం

వేంపల్లె, జూలై 12 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణం వేంపల్లె-రాయచోటి బైపాస్ రోడ్డు ఇళ్ల వద్ద అగ్నిప్రమాదం జరిగింది. మాజీ దేవస్థాన చైర్మన్ ఎద్దల కొండ్రాయుడు వెనుక గుర్తుతెలియని వ్యక్తులు టైరుకు నిప్పుపెట్టగా ఇళ్లమీదకు మంటలు వచ్చా యి. ఇంటి వెనుకనున్న వాకిళ్లు, మోటా ర్లు, ఇతర వస్తువులు కాలిపో యాయి. ఇళ్లంతా పొగతో నలుపురంగులో నిండిపోయింది. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడం వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. సుమారు రూ.3లక్షలకుపైగా నష్టం జరిగినట్లు అంచనా వేశారు.

రహదారి ప్రమాదాల నియంత్రణే లక్ష్యం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కడప టూటౌన్ ఎస్ఐ సిద్దయ్య

కడప క్రైం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : ప్రతి శనివారం రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పోలీసు అధికారులకు కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్, ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. వాహనదారులు రహదారి భద్రత నియామాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందన్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆయా పోలీసుస్టేషన్ల పరిధిలో జిల్లా పోలీసు అధికారులు, ప్రజలకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. బైకులు నడిపే వారు కచ్చితంగా హెల్మెట్లు ధరించే విధంగా, ఓవర్ స్పీడ్, ఓవర్‌లోడుతో వాహనాలు వెళ్లకుండా, డ్రంకెన్ డ్రైవ్ చేయరాదని తదితర భద్రతా ప్రాముఖ్యతలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

నిరంతర కృషితోనే విజయాలు

రాజయోగిని బ్రహ్మకుమారి శివలీల అక్కయ్య

కడప కల్చరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): నిరంతర కృషి, స్పష్టమైన లక్ష్యం, మీ సామర్థ్యంపై మీకు నమ్మకం కలిగివున్నపుడే విజయాలు సాధ్యమౌతాయని రాజయోగిని బ్రహ్మకుమారి శివలీల అక్కయ్య (విశాఖ) అన్నారు. శనివారం స్థానిక ఓం శాంతినగర్ సేవా కేంద్రంలో విజయ రహస్యం అనే అంశంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శివలీల అక్కయ్య మాట్లాడారు. ఏ విషయంగా విజయం సాధించాలన్నా సమయపాలన, అంకితభావం, సానుకూల దృక్పథం కలిగివుండాలన్నారు. అవి లేకపోతే విజయాలు సాధ్యం కాదన్నారు.

ఆమ్‌ఆద్మీపార్టీ కార్యవర్గం ఎంపిక

వేంపల్లె,జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కార్యవర్గంలో వేంపల్లెకు చెందిన దాదాపీర్‌ను కో-ఆర్డినేటర్ గాను, రహంతుల్లాను కోశాధికారిగాను నియమిస్తున్నట్లు రాష్ట్ర కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యం ప్రకటించారు. పార్టీ పటిష్టతకు, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు.

ట్రాఫిక్‌పై విస్తృత అవగాహన

కడప క్రైం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలో స్కూలు, కాలేజీ విద్యార్థులు, ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం నగరంలోని శ్రీహరి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు కడప ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ డీకే జావేద్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తాము రోడ్డుభద్రత నియమ నిబంధనలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈకార్యక్రమం లో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పది

కడప నాగరాజుపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): అన్ని దానాల్లోకెల్లా అన్నదానం చాలా గొప్పదని ఉపాధ్యాయులు ఎంఏ సీతారామయ్య అన్నారు. శనివారం కడపలోని జిల్లా పరిషత్ హాల్ పక్కన ఉన్న పట్టణ నిరాశ్రయగృహంలో ఉన్న వృద్ధులకు పోరుమామిళ్ల మండలం, ఎంపీయూపీఎస్ స్కూల్, ఎస్ వెంకటరామాపురంలో ఎస్ఏ (ఇంగ్లీష్)గా పనిచేస్తున్న ఎంఏ సీతారామయ్య అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రామాంజనేయులు, జిల్లా అధ్యక్షుడు ఆవుల శ్రీనివాసులు, పట్టణ నిరాశ్రయ నిర్వాహకులు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే టీడీపీ ధ్యేయం



సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో పార్థసారథిరెడ్డి

వేముల, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే టీడీపీ ధ్యేయమని తుంగభద్ర హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పార్థసారధిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని నల్లచెరువుపల్లె గ్రామంలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి వెళ్లికూటమి ప్రభుత్వం సంవత్సరకాలంలో చేసిన పనులను ప్రజలకు వివరించారు. కరపత్రాలు పంపిణీ చేసి ప్రజ సమస్యలు అడిగితెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పేర్ల శేషారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి అర్ధరాత్రి నుంచి నిరవధిక సమ్మె



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

కడప సెవెన్ రోడ్స్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు జీఓ 36 ప్రకారం వేతనాలు పెంచకుంటే నిరవధిక సమ్మె తప్పదు అని సీఐటీయూనగర ప్రధాన కార్యదర్శి వీవీ సుబ్బయ్య డిమాండ్ చేశారు. కడపకోటిరెడ్డి సర్కిల్ వద్ద నుంచి కార్పొరేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు

'రాజకీయ వయసుపై అందరికీ ఒకే విధానం ఉండాలి'

వేంపల్లె, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో నాయకులు కొనసాగే విషయంపై వయసుకు సంబంధించి అందరికి ఒకే విధానం ఉండాలని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికారప్రతినిధి తులసిరెడ్డి సూచించారు. గతంలో బీజేపీ అగ్రనేత అద్వానీని 75ఏళ్ల పైబడ్డాయని పక్కపెట్టారు, కానీ మోదీ విషయంలో ఎందుకు పట్టించుకోవడం లేదని ఆ పార్టీ నేతలను ఒక ప్రకటనలో ప్రశ్నించారు. విలువలు, విశ్వసనీయత ఉన్ననాయకుడు అయితే వెంటనే రాజకీయాల నుంచి తప్పుకోవాలని సలహా ఇచ్చారు. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ 75ఏళ్లు నిండిన వారు రాజకీయాలకు రిటైర్‌మెంట్ ఇవ్వాలని చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ కారణంగా అద్వానీ, మురళిమనోహర్ జోషి, వెంకయ్యనాయుడు, జశ్వంత్‌సింగ్ తదితర రాజకీయ నేతలు తప్పుకొన్నారని ఆయన తెలిపారు.

స్మార్ట్ మీటర్ల బిగింపు తక్షణమే ఆపండి: సీపీఎం

కడప సెవెన్ రోడ్స్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు స్మార్ట్ మీటర్ల బిగింపును తక్షణమే ఆపాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బి.దస్తగిరిరెడ్డి, కె.శ్రీనివాసులరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం కడప రామకృష్ణనగర్‌లో స్మార్ట్ మీటర్ల బిగింపు రద్దు చేయాలని కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. అనంతరం స్మార్ట్ మీటర్లు రద్దు స్టిక్కర్లు ఇంటింటికి అతికించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

'నైతిక విలువలు ఉంటే రాజీనామా చేసి మాట్లాడాలి'



పనులను పరిశీలించిన రఘునాథరెడ్డి

చక్రాయపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): నైతిక విలు వలు ఉంటే గండి దేవస్థానం చైర్మన్‌గా కొనసాగుతున్న వైసీపీనాయకుడు రాజీనామా చేసి మాట్లాడాలని వేంపల్లె టీడీపీ ఇన్‌చార్జి రఘు నాథరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన గండి వీరాంజనేయస్వామి దేవస్థానాన్ని దర్శించుకొని అనంతరం అక్కడ జరిగే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కొనసాగుతున్న వైసీపీ నాయకులు నైతిక విలువలు లేకుండా మాట్లాడుతున్నారని ఆయన పేర్కొన్నారు. దేవుడు అంటే నమ్మకం లేని వ్యక్తులు దేవాలయానికి వచ్చి ఏదోదో మాట్లాడడం దేవుడు క్షమించరన్నారు. గతంలో పనులు ప్రారంభించి నాలుగు సంవత్సరాలు అదే పార్టీలో ఉండివారు చేసిందేమీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ మాజీ చైర్మన్‌తో పాటు మాజీచైర్మన్ కల్లూరు వెంకటస్వామి, కావలి భాస్కర్, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



సింహాద్రిపురం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకుడు హరి ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సప్తాహ శనివారాల వ్రత పూజల్లో భాగంగా ఏడు శని వారాలు ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. జంగంపల్లి ఆలయ అర్చకులు పవన్‌కుమార్ శర్మ శనివారం ఉదయం గణపతి పూజ, పుణ్యా వచనం, స్వామి వారికి పంచామృతాభిషేకం, అష్టోత్తర శతనామావళి, లక్ష్మీ వ్రతం, తదితర పూజలు నిర్వహించారు. నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మహా మంగళ హారతితో కార్యక్రమం ముగిసింది.

వల్లూరు పీఏసీఎస్ చైర్మన్‌గా నాగేశ్వర్‌రెడ్డి



వల్లూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : వల్లూరు మండల ప్రాథమిక వ్యవసాయ సహకార కమిటీ చైర్మన్‌గా లేబాక నాగేశ్వర్‌రెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఈయన వల్లూరు టీడీపీ అధ్యక్షుడిగా ఉన్నారు. తనను సొసైటీ చైర్మన్‌గా నియమించినందుకు టీ డీపీ ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డికి, ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉండి తమ ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యం నుంచి రైతులకు కావాల్సిన రుణాలు అందించి వారికి మంచి చేస్తామన్నారు.

పూర్తిగా పాడైతే కానీ దృష్టి పెట్టరా..?

హైవే వంతెన దెబ్బతిని బయటికి కనిపిస్తున్న కడ్డీలు



హైలెవెల్ వంతెనపై కాంక్రీటు లేచిపోయి కనిపిస్తున్న కడ్డీలు

చెన్నూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు వద్ద కడప - కర్నూలు జాతీయరహదారిలో పెన్నా హైలెవెల్ వంతెన దెబ్బతిని కడ్డీలు బయటికి కనిపిస్తున్నాయి. వంతెన కట్టిన నాలుగేళ్ల తరువాత ఈ కడ్డీలు బయటికి కనిపిస్తున్నా ఇంత వరకు మరమ్మతులపై దృష్టి పెట్టలేదు. దీంతో ప్రజలు మరింత దెబ్బతిన్న తరువాత దృష్టి పెడతారేమోనని వ్యంగ్యంగా మాట్లాడుకుంటున్నారు. వంతెనపై నిత్యం తిరిగే వాహనాలు అధిక వేగంతో వెళుతుంటాయి. ఈ వంతెన స్లాబుకు ఉన్న కడ్డీలలో ఏ ఒక్కటి తెగినా వాహనాలు వెళ్లే వేగానికి వాటి టైర్లకు గుచ్చుకుని పంచర్లు అయి పెద్ద ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. గతంలో ఈ హైవే వంతెన దెబ్బతిని పెచ్చులూడి కడ్డీలు బయటికి కనిపిస్తున్నాయని వార్తలు రాసినప్పటికీ అధికారుల్లో స్పందన శూన్యమే. మామూలుగా హైవే అధికారులు రోడ్లు, వంతెన మరమ్మతులు కొన్నేళ్ల పాటు నిర్వహించాలి. రోడ్డు వరకు అక్కడక్కడా తారు లేచిపోయి కంకర నడలి గుంతలు పడితే మరమ్మతులు చేపట్టడం జరుగుతుంది. అయితే నదులపై నిర్మించిన వంతెనల విషయంలో ఎందుకు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారో అర్థం కావడంలేదని ప్రజలు అంటున్నారు. ఇప్పటికి అయితే ఇది చిన్నసమస్యనే. కొద్ది వరకే దెబ్బతింది. ఇక రాబోవు రోజుల్లో ఈ దెబ్బతిన్న ప్రాంతమే మరింత పెద్దదై కడ్డీలు పూర్తిగా బయటికి వస్తే ప్రమాదాలు జరగవని గ్యారంటీ ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అందులో నదిపై ఉన్న వంతెన కాబట్టి ఈ కడ్డీలు పొరపాటున కట్ అయితే జరిగే పరిస్థితులు ఒక్కసారి ఊహించుకుంటే దారుణంగా ఉంటుంది. ఇది హైవే అధికారులకు తెలియందేమీ కాదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెన పెచ్చులూడిన చోట కడ్డీలు కనిపించకుండా తారునో ,కాంక్రీటో వేసి మరమ్మతులు చేపట్టాలి. లేదంటే ఇప్పుడు చిన్నగా అనిపించిన సమస్య రాబోవు రోజుల్లో పెద్దదై ప్రమాదాలకు దారి తీస్తుందన్న భయం ప్రజల్లో నెలకొని ఉంది. అధికారులు దీనిపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

అడ్డూఅదుపు లేకుండా ఇసుక దోపిడీ

● ట్రాక్టర్లు, టిప్పర్లతో సాగుతున్న అక్రమ రవాణా ● దేవగుడి తదితర ప్రాంతాల్లో డంపు చేస్తున్న వైనం ● పట్టించుకోని అధికారులు

జమ్మలమడుగు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): డివిజన్ కేంద్రమైన జమ్మలమడుగు రెవెన్యూ పరిధిలో ఇసుక దోపిడీకి అడ్డూఅదుపులేకుండా పోతోంది. రాత్రింబవళ్లు ట్రాక్టరు, టిప్పర్లతో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారని పలువురు విమర్శిస్తున్నారు. మండలంలోని దానవులపాడు, సున్నపురాళ్లపల్లె గ్రామాల మధ్య పెన్నానదిలో ఇసుక గుంతలు దర్శనమిస్తున్నాయి. పగలు ఇసుక ట్రాక్టర్లకు ఇసుక నింపుతారని ఇటీవల రాత్రి సమయాల్లో ఇసుకను పెన్నానది పక్కన డంప్ చేసి బయటి ప్రాంతాలకు తరలిస్తారని స్థానికులు వాపోతున్నారు. అలాగే దేవగుడి గ్రామంలో ఎస్సీ కాలనీ పక్కనే పెన్నానది సుగుమంచిపల్లె వెళ్లే సర్కిల్‌లో ఇసుక డంప్‌లు ఉన్నాయి. రాత్రి సమయంలో అక్కడ టిప్పర్లకు ఇటాచీలతో ఇసుకను నింపుకుని పి.సుగుమంచిపల్లె గ్రామం మీదుగా ప్రొద్దుటూరు, కర్నూలు వైపు తరలిస్తున్నారని దీంతో ఇసుక వనరులు తగిపోయి తాగునీటికి సైతం ఇక్కట్లు పడుతున్నాయని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పి.సుగుమంచిపల్లె గ్రామానికి వెళ్లే దారిలో రోడ్డుకు అడ్డంగా టిప్పరు డ్రైవర్ ఏమి సమస్య వచ్చిందో అక్కడే ఇసుకను డంపుచేసి వెళ్లిపోయినట్లు వాహనదారులు తెలిపారు. రోడ్డుకు అడ్డంగా ఇసుక ఉండడం, వాహనాలు వెళ్లాలన్నా ఇబ్బందికరంగా ఉందని వాపోతున్నారు. జమ్మలమడుగు నుంచి ప్రొద్దుటూరు రోడ్డులో పెన్నానది పరిసర ప్రాంతాల్లో బోర్ల కింద రైతులు పంటలు సాగు చేసేవారు ఆయా గ్రామాలకు సరఫరా అయ్యే మంచినీటి బోర్ల వద్ద ఇసుక లేక బోర్లకు నీళ్లురాక పంటలను పొలాల్లోనే వదలుకోవాల్సి వస్తోందని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జమ్మలమడుగు డివిజన్ కేంద్రంలో అధికారులందరికి తెలిసినా ఆ ప్రాంతాలకు వచ్చి పరిశీలించడానికి జంకుతున్నట్లు కొందరు రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణా దోపిడీని అరికట్టాలని లేకుంటే తాగునీటికి సైతం ఇబ్బందులు పడాల్సవస్తుందని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



పి.సుగుమంచిపల్లె రోడ్డుపైనే ఇసుక డంపు



దేవగుడి పెన్నానది పక్కన డంప్ చేసిన ఇసుక

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

ఇసుక అక్రమ దోపిడీ చేస్తున్న ప్రాంతాలను రెవెన్యూ, పోలీసు అధికారులతో వెళ్లి పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ఇసుక అక్రమ రవాణా జరుగకుండా రెవెన్యూ సిబ్బందితో నిఘాపెంచాం

-శ్రీనివాసులరెడ్డి, తహసీల్దార్, జమ్మలమడుగు

పీఎం ఫసల్ బీమాను సద్వినియోగం చేసుకోండి

కాశినాయన జూలై12(ఆంధ్రజ్యోతి): వాతావరణ ఆధారితంగా అమలు చేస్తున్న ప్రధాన మంత్రి ఫసల్ బీమాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ విస్తరణాధికారి రవి తెలిపారు. ఈనెల (జూలై) 15వ తేదీలోపు పత్తి పంటకు ఎకరాకు రూ.2000 చెల్లిస్తే రూ.40వేలు బీమా వర్తిస్తుందన్నారు. అలాగే వేరుశనగ పంటకు ఎకరాకు రూ.560 చెల్లిస్తే రూ.28000, అరటి పంటకు ఎకరాకు రూ.3025 చెల్లిస్తే రూ.60500, చీనీ పంటకు ఎకరాకు రూ.2750లు చెల్లిస్తే రూ.55000 బీమా వర్తిస్తాయన్నారు. అలాగే జూలై 30వ తేదీలోపు వరికి ఎకరాకు రూ.84 లు చెల్లిస్తే రూ.42000, ఉల్లికి ఎకరాకు రూ.90లు చెల్లిస్తే రూ.45000లు , జొన్న పంటకు ఎకరాకు రూ.38 చెల్లిస్తే రూ.19000లు బీమా చెల్లిస్తారన్నారు. అలాగా మినుము పంటకు ఎకరాకు రూ.38లు ఫసల్ బీమా చెల్లిస్తే రూ.19000లు, కందికి ఎకరాకు రూ.36 చెల్లిస్తే రూ.38000 బీమా వర్తిస్తుందన్నారు. ఆయా పంటలు సాగుచేసిన రైతులు గడువులోగా ప్రధానమంత్రి ఫసల్ బీమా ప్రీమియం చెల్లించి బీమా పథకంలో చేరినట్లైతే వాతావరణ ఆధారితంగా పంట నష్టం జరిగినప్పుడు ఆయా పంటలు వేసినష్టపోయిన రైతులు బీమా పొందవచ్చ న్నారు.

నేడు కాశినాయనకు మంత్రి గొట్టిపాటి రాక

కాశినాయన జూలై12(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదివారం కాశినాయన మండల పర్యటనకు వస్తున్నట్లు టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బంగారు గురివిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

లక్ష్మీనరసింహుడికి ఆషాఢ మాస పూజలు

బద్వేలు రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) :మున్సిపల్ పరిధిలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన స్వయంభు లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆషాఢమాసం మూడో శనివారం సందర్భంగా వేకువజామునే స్వామివారికి అభిషేకం, అనంతరం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి, అమ్మవార్లు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పూజారి పెంచలయ్య స్వామి భక్తులకు తీర్థ ప్రసాదాలు, అందించారు. ఈ కార్యక్రమంలో అధికసంఖ్యలో పట్టణ గ్రామీణ ప్రాంత ప్రజలు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

పోరుమామిళ్ల , జూలై 12 (ఆంధ్రజ్యోతి) : బద్వేలు పట్టణంలో ఈ నెల 22, 23, 24 తేదీల్లో జరిగే జిల్లా 25వ మహాసభలను జయప్రదం చేయాలని పోరుమామిళ్ల మండల సమితి కార్యదర్శి రవికుమార్, నాయకులు కేశవ, ఫిరోజ్‌లు తెలిపారు. శనివారం వారు పోరుమామిళ్లలో విలేకర్లతో మాట్లాడుతూ జిల్లా సమగ్రాభివృద్ధి కోసం బద్వేలులో మహాసభ నిర్వహిస్తున్నామన్నారు. ఈ మహాసభలకు కార్మికులు, ప్రజాసంఘాల నేతలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ, కార్యదర్శివర్గ సభ్యులు ఓబులేసు, గుజ్జుల ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి గాలిచంద్ర తదితరులు ఈ సభల్లో పాల్గొంటారన్నారు.

వ్యాధిగ్రస్థుడికి ఆర్థికసాయం

ప్రొద్దుటూరు టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక 23వ వార్డుకు చెందిన షేక్ ఆరీఫ్ ఎస్ఎల్‌డీ వ్యాధితో బాధపడుతుండడంతో చికిత్స కోసం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎస్.ఇర్ఫాన్‌బాష ఆర్థికసాయం అందజేశారు. శనివారం ఆ యువకుడు కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి వెళ్లి తమకు వచ్చిన వ్యాధిని గురించి వివరించి చికిత్స కోసం రూ.5 లక్షలు ఖర్చు అవుతుందని, తగిన ఆర్థికసాయం అందజేయాలని కోరారు. దీనికి స్పందించిన ఇర్ఫాన్‌బాష ఆ యువకునికి రూ.20వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదవారైన ఆరీఫ్‌కు దాతలు ఆర్థిక సాయం అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బలిజలకు పదవుల్లో తగిన ప్రాధాన్యం

మైదుకూరు రూరల్, జులై 12(ఆంధ్రజ్యోతి) : మైదుకూరు నియోజకవర్గంలోని బలిజ కులస్తులకు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ పదవుల్లో తగిన ప్రాధాన్యత కల్పించారని శనివారం టీడీపీ పట్టణ అధ్యక్షుడు దాసరి బాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏపీ రవీంద్ర తెలిపారు. దువ్వూరులో వారు విలేకర్లతో మాట్లాడుతూ .కూటమి ప్రభుత్వం ఏర్పాడి కేవలం ఏడాదిలోనే టీడీపీ పట్టణ అధ్యక్ష పదవి, ప్రభుత్వ ఆసుపత్రి కమిటీ మెంబర్, మార్కెట్ కమిటీ పదవి, మాధవరాయస్వామి ఆలయ చైర్మన్ పదవి, సొసైటీ చైర్మన్ పదవి బలిజలకు ఇచ్చారని వారు పేర్కొన్నారు.

రస్తా వివాదం పరిష్కరించాలని ఆందోళన

ప్రొద్దుటూరు , జూలై 12 (ఆంధ్రజ్యోతి) : పెద్ద శెట్టిపల్లె గ్రామంలోని ఎస్సీకాలనీలో వెంకటసుబ్బయ్య అనే వ్యక్తి రోడ్డు ను ఆక్రమించి తన సొంతరోడ్డని అడ్డుకుంటున్నాడని శనివారం స్థానిక రూరల్ పోలీసు స్టేషన్ వద్ద పెద్దశెట్టిపల్లె ఎస్సీ మహిళలు ఐద్వా ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా సీపీఎం నేతలు మాట్లాడుతూ పంచాయతీ వేసిన సిమెంటు రోడ్డును ఆక్ర మించి సాటి ఎస్సీలకు రాకపోకలకు రస్తాలేకుండా చేశారన్నారు. దీనిపై తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేశామన్నారు. ఆస్థలం సర్వే చేసి ఎవరిదోతేల్చాలన్నారు. కానీ సదరు వెంకటసుబ్బయ్య దౌర్జన్యం చేస్తున్నాడని అతనిపై చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై సీఐ బాలమద్దిలేటిని వివరణ కోరగా వెంకటసుబ్బయ్య దయానిధి అనే వారు శెట్టిపల్లె ఎస్సీకాలనీలో పక్కపక్కనే వుండేవారన్నారు. వెంకట సుబ్బయ్య రోడ్డులో తన స్థలం 5 అడుగులువుందని కోర్టుకు వెళ్లాడన్నారు. ఈ వివాదం నడుస్తుందన్నారు. ఈరస్తా వివాదంపై తహసీల్దారుకు సర్వేచేసి హక్కుదారులు ఎవరో తేల్చమని నివేదిక కోరామన్నారు. వారి నివేదిక మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. కానీ సీపీఎం వారు పోలీసు స్టేషను వద్ద ధర్నా చేయడం పై చర్యలు తీసుకుంటామన్నారు.

వరి సాగులో రైతన్నలు బిజీ బిజీ



దానవులపాడు పొలంలో వరినార్లు నాటుతున్న కూలీలు

జమ్మలమడుగు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో రైతులు కొన్ని గ్రామాల్లో వరి సాగులో బిజీ అయ్యారు. మండలంలోని దానవులపాడు, ధర్మాపురం తదితర గ్రామాల్లో ఖరీఫ్ సీజన్‌లో భాగంగా రైతులు, రైతు కూలీలు పొలాల్లో వరి సాగుకు సన్నద్ధమయ్యారు. మండలంలో గత నెల రోజుల నుంచి రైతులు వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. అయిఏ ప్రస్తుతం వర్షాలు కురవకపోయినా బోర్ల కింద వరి సాగు చేసేందుకు రైతులు వరినార్లు నాటుతున్నారు. ధర్మాపురం, దానవులపాడు, దేవగుడి, పి.సుగుమంచిపల్లి, పెద్దదండ్లూరు, అంబవరం, అనంతగిరి, గూడెం చెరువు, పూర్వపు బొమ్మేపల్లె గ్రామాల్లో వరి అధికంగా పండిస్తారు. ఇటీవల 15 రోజులుగా రైతులు వరి సాగుకోసం బిజీ అయ్యారు. మండలంలో ఇప్పటి వరకు 350 ఎకరాలకుపైగా రైతులు వరి సాగు చేశారని మొత్తం అన్ని గ్రామాలకు దాదాపు రెండు వేల ఎకరాలకు తగ్గకుండా వరి సాగు చేస్తారని రైతులు తెలిపారు. మరికొంతమంది రైతులు ఇతర పంటలపై శ్రద్ధ పెట్టినట్లు తెలిపారు. ఈసారి వర్షాలు బాగా కురిస్తే సమస్య ఉండదని రైతులు తెలిపారు.

రచయిత జింకా సుబ్రమణ్యంకు గౌరవ డాక్టరేట్

ప్రొద్దుటూరు టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ రచయిత జింకా సుబ్రమణ్యంకు మనం ఫౌండేషన్ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. మనం ఫౌండేషన్ 8వ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాదులోని త్యాగరాజు గానసభ కార్యక్రమంలో తెలంగాణా హైకోర్టు న్యాయమూర్తి శ్రీరామమూర్తి, గ్రంథాలయ అధికారి మారేళ్ల శ్రీనివాసరావు, రైల్వే డివిజనల్ డీఎస్పీ సుబ్బారావులు ఆయనకు డాక్టరేట్‌ను ప్రదానం చేసి పద్మ ప్రతిభ జాతీయ పురష్కారాన్ని అందజేశారు. ఆయనకు డాక్టరేట్ రావడంపట్ల సాహితీవేత్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎడిటర్ చాంద్‌బాష, వంశీ రామరాజు, దైవజ్ఞశర్మ, మనం ఫౌండేషన్ చైర్మన్ చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.



జింకా సుబ్రమణ్యంకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తున్న దృశ్యం

సర్పంచ్‌కు సన్మానం

పోరుమామిళ్ల , జూలై 12 (ఆంధ్రజ్యోతి) : పోరుమామిళ్ల మేజరు పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్‌ను ముస్లిం యువకులు సన్మానించారు. మొహర్రం వేడుకల సం దర్భంగా తాము పీర్ల పండుగ నిర్వహించడానికి తన వంతు సహాయ సహకారాలు అందించినందుకు ఆయనను ఆ కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో దర్వేష్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు దాటేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి

కొండాపురం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) వాహనదారులు, పాదాచారులు రోడ్డు దాటేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని కొండాపురం ఎస్సై ప్రతాప్‌రెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం స్థానిక ప్రజలకు నేషనల్ హైవేపై రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. అతివేగం ప్రమాదకరమని, రోడ్డు దాటేటప్పుడు వాహనాలను గమనించాలని కోరారు. ముఖ్యంగా యువత స్పీడుగా వెళ్లకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని కోరారు. వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్, సీటుబెల్టు ధరించాలని ఎస్సై తెలిపారు.



రోడ్డు భద్రతా నియమాల గురించి ప్రజలకు వివరిస్తున్న కొండాపురం ఎస్సై

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

ముద్దనూరు జూలై12(ఆంధ్రజ్యోతి):మండల పరిధి తాడిపత్రి హైవే రోడ్డులోని ఉమ్మారెడ్డిపల్లె వద్ద వాహనం ఢీకొని గాయపడిన వృద్ధురాలు దేవమ్మ(65) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు. ఉమ్మారెడ్డిపల్లె గ్రామానికి చెందిన దేవమ్మ రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ప్రొద్దుటూరు ఆసుపత్రికి అక్కడి నుంచి పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా. చికిత్స పొందుతూ మృతి చెందింది.మృతురాలి కుమారుడు మద్దిలేటి ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అట్లూరులో వ్యక్తి మృతి

అట్లూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని రెడ్డిపల్లెకు చెందిన పడిగె క్రిష్టఫర్ (42)కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. శుక్రవారం కడప నుంచి బద్వేలుకు వస్తున్న క్రిష్టఫర్ రెడ్డిపల్లె వద్ద వేపచెట్టుకు ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతుడికి భార్య శిరీషా, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఇతను సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. కుటుంబ పెద్ద చనిపోవడంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదచాయలు అలుముకున్నాయి.

క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించిన రితేష్‌రెడ్డి

గోపవరం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) :రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని బద్వేలు టీడీపీ ఇన్‌చార్జి రితేష్‌కుమార్‌రెడ్డి తన వాహనంలో బద్వేలు ప్రభుత్వాసుపత్రికి తరలించి శనివారం వైద్య చికిత్సలు అందించారు. వివరాల్లోకి వెళితే.. ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా చేపట్టిన ఏడాది సుపరిపాలన కార్యక్రమంలో భాగంగా గోపవరం మండ లంలోని సంద్రపల్లె గ్రామానికి భారీ కాన్వా య్‌తో వెళుతున్నారు. అదే సమయంలో దారిలో రోడ్డు ప్రమాద ఘటనను గమనించి వెంటనే కాన్వాయ్‌ను ఆపివేశాడు. గాయ పడ్డ వారి వద్దకు వెళ్లి వారి పరిస్థితిని పరిశీలించి 108 వాహనం రావడం ఆలస్య మవుతుందని గమనించి ఆయన తన సొంత వాహనంలోనే వారిని ఎక్కించుకుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోలీసులకు సమాచారమిచ్చారు. అనంతరం గాయ పడిన వారికి మెరుగైన వైద్యసేవలందించాలని డాక్టర్లను కోరారు. రితేష్‌రెడి మానవ తను చాటుకున్నారని బాధిత కుటుంబీకులతోపాటు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



రోడ్డుప్రమాదంలో గాయపడ్డ వారిని పరిశీలిస్తున్న రితేష్‌రెడి

లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం

బద్వేలు రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) :ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో, స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ వి.మల్లేష్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎన్జీవో హోంలో పీసీపీఎండక్ చట్టంపై డిస్ట్రిక్ లెవెల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగ నిర్ధారణ చేసినట్లయితే జైలుశిక్ష, జరిమానా విధించడం తోపాటు అందుకు ప్రోత్సహించిన వారికి కూడా జరిమానా, జైలుశిక్ష ఉంటుందని పేర్కొన్నారు. ఆడ, మగ ఇద్దరూ సమానులేనని అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, డాక్టర్లు రాజేశ్‌కుమార్, మహేశ్వర్‌రెడ్డి, శరత్‌చంద్ర, శ్రీనివాసులు, వినయ్‌కుమార్, హెల్త్ సూపర్‌వైజరు శివరామిరెడ్డి, స్వచ్ఛంధ సభ్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ మల్లేశ్

ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి

జమ్మలమడుగు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై ప్రజలను తిప్పుకోకుండా అధికారులు వెంటనే పరిష్కరించాలని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం జమ్మలమడుగు మండలంలోని దేవగుడి గ్రామంలోని భూపేశ్‌రెడ్డి స్వగృహంలో నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై సమస్యలకు సంబంధించిన వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా భూపేశ్‌రెడ్డి సంబందిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. అనేక సార్లు ప్రజలు కార్యాలయాల వద్దకు వస్తున్నా వారి సమస్యలను పట్టించుకోకుండా ఇబ్బందులు కలిగించడం సరికాదని వెంటనే ప్రజా సమస్యలు నిర్లక్ష్యం చేయకుండా పరిష్కరించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



దేవగుడిలో ప్రజల అర్జీలు స్వీకరించి మాట్లాడుతున్న భూపేశ్‌రెడ్డి

అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు

బ్రహ్మంగారిమఠం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం ద్వారా అమలయ్యే సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కృషి చేస్తు న్నారని బ్రహ్మంగారిమఠం మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని సోమిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీలో ప్రభుత్వం ఈ ఏడాది కాలంలో ప్రజలకు అమలు చేసిన పథకాల గురించి సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించి వివరించారు. అలాగే బి.మఠం మండ లాన్ని ఆదర్శ మండలంగా తీర్చి దిద్దడమే ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ లక్ష్యమని సుబ్బారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సోమిరెడ్డిపల్లె టీడీపీ ఇన్‌చార్జి సాంబశివారెడ్డి, పూజా శివాయాదవ్, రమణయ్య, సన్నపూరి శ్రీను, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



ప్రజలకు కరపత్రాలు అందిస్తున్న టీడీపీ అధ్యక్షుడు సుబ్బారెడ్డి, నాయకులు

ఎమ్మెల్యేని కలిసిన మైదుకూరు సొసైటీ చైర్మన్

మైదుకూరు రూరల్, జులై 12(ఆంధ్రజ్యోతి) :మైదుకూరు రైతు సేవ సొసైటీ చైర్మన్ పాశం మారుతి శనివారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే సుధాకర్‌యాదవ్ నివాసంలో ఎమ్మెల్యేని కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను పూలమాల, శాలువతో సన్మానించారు. అనంతరం మారుతి మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఇచ్చిన పదవిని బాధ్యాతయుతంగా నిర్వర్తిస్తానని తెలిపారు. పదవిని అందించిన ఎమ్మెల్యేకు మారుతి కృతజ్ఞతలు తెలిపారు. మారుతితో పాటు పార్టీ పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏపీ రవీంద్ర, ధనపాల జగన్, తుపాకుల రమణ, బండి అమర్‌నాద్ తదితరులు ఉన్నారు.

ఖాజీపేటలో: అగ్రహారం సొసైటీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని సొసైటీ అధ్యక్షుడు హరినాథరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం శాసనసభ్యుడు పుట్టా సుధాకర్ యాదవ్‌ను హైదరాబాదులోని తన నివాసంలో కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ తరుపున ప్రజలకు మరిన్ని సేవలు చేసే అవకాశం కల్పించిన ఎమ్మెల్యేకు రుణపడి ఉంటానని ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు లక్ష్మిరెడ్డి, కొండపేట కేసీ కెనాల్ కమిటీ చైర్మన్ రవీంద్రారెడ్డి, టీడీపీ నాయకులు నంద్యాల సుబ్బయ్య, ఫరూక్, సొసైటీ మెంబర్లు నాగేశ్వరుడు, ఓబుళరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠంలో: బ్రహ్మంగారిమఠం మండలంలోని సోమిరెడ్డిపల్లె ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం చైర్మన్‌గా యల్లటూరు సాంబశివారెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా సాంబశివారెడ్డి ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నూతనంగా ఎంపికైన సొసైటీ చైర్మన్‌కు మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూజా శివాయాదవ్, రమణయ్య, సన్నపూరి శ్రీను, నూరి పాల్గొన్నారు.

చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

జమ్మలమడుగు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): చలో ఢిల్లీ కార్యక్రమానికి అందరూ హాజరై విజయవంతం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ తెలిపారు. శనివారం జమ్మలమడుగు స్థానిక ఎన్జీవో హోంలో చలో ఢిల్లీ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభజన హామీల అమలుకోసం కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని నిరశిస్తూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 18న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందన్నారు. నిరుద్యోగ యువత పాల్గొనాలని ఆయన కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి విభజన సమయంలో ప్రత్యేక హోదా ఇస్తామని అనేక హామీలిచ్చి కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ప్రసాద్, కృష్ణారెడ్డి, అరుణ్, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి జీలుగలు పంపిణీ

బద్వేలు రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రైతులకు పచ్చిరొట్ట ఎరువు విత్తనాలైన జీలుగలను సబ్సిడీతో సోమవారం నుంచి పంపిణీ చేయడం జరుగుతుందని మండల వ్యవసాయశాఖ అధికారిణి అరుణ తెలిపారు. జీలుగలు వేసి దున్నేస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు వచ్చే అవకాశం ఉందని ఆమె తెలిపారు. మండలానికి వంద క్వింటాళ్లు మంజూరయ్యాయని, వాటిని బద్వేలు, రాజుపాలెం, అనంతరాజపురం స్టాకుపాయింట్లలో అందుబాటులో ఉంచామన్నారు. రైతులు ఈ మూడు ప్రదేశాల్లో ఎక్కడైనా వేలిముద్ర వేసి జీలుగలు తీసుకోవచ్చన్నారు. రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ జిరాక్స్, ఫోను నెంబరుతో వ్యవసాయ సహాయకులను సంప్రదించి తీసుకోవాలన్నారు.జీలుగలు పదికేజీల ప్యాకెట్ ధర రూ.1230 ఉంటుందని, సబ్సిడీ రూ.615 పోను రైతు 615 చెల్లించాలన్నారు. ఎకరాకు ఓ ప్యాకెట్ ఇవ్వడం జరుగుతుందన్నారు.